# సాక్షి నంద్యాల

శనివారం ı 1 ı ఫిబ్రవరి ı 2025






## భ్రమరాంబాదేవికి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శుక్రవారం శాస్త్రోక్తంగా ఊయల సేవ నిర్వహించారు. ఊయలలో స్వామి అమ్మవార్లను ఉంచి సహస్రనామ పూజలు చేపట్టారు.



## అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణకు శుక్రవారం విజయవాడకు చెందిన లక్ష్మీసుధాకర్ రూ.2.02.232 విరాళాన్ని ఆలయ ఏఓ హిమబిందుకు అందించారు.



## ఉసూరుమని 'పింఛన్'

ఉమ్మడి కర్నూలు జిల్లాలో కొత్త పింఛన్ల కోసం అర్హులు ఎదురు చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం అనర్హత పేరుతో తొలగింపుల పర్వం పూర్తి అయ్యే వరకు కొత్త పింఛన్లు ఇచ్చే అవకాశం లేదు. 8లో▸

## న్యూస్‌రీల్

### మల్లన్న హుండీ ఆదాయం రూ.2.59 కోట్లు



కానుకలను లెక్కిస్తున్న దేవస్థాన సిబ్బంది

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల క్షేత్రంలోని ఉభయ దేవాలయాల్లో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా నగదు రూపేణా రూ.2,59,68,400 లభించినట్లు దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం దేవస్థాన చంద్రావతి కల్యాణ మండపంలో హుండీల లెక్కింపులు చేపట్టారు. గత 22 రోజుల్లో భక్తులు ఈ కానుకలను సమర్పించారు. నగదుతో పాటు బంగారం 64.200 గ్రాములు, వెండి 3.170 కిలోలు లభించినట్లు ఈఓ తెలిపారు. అలాగే యూఎస్‌ఏ డాలర్లు 590, చైనా యువాన్స్ 100, సౌదీ అరేబియా రియాల్స్ 5, కువైట్ దినార్స్ 2, కెనడా డాలర్లు 10, యూఏఈ దిర్హమ్స్ 1090, సింగపూర్ డాలర్లు 14, ఖత్తార్ రియాల్స్ 1, యూరోస్ 5, మలేషియా రింగిట్స్ 23 మొదలైన విదేశీ కరెన్సీ కూడా ఈ హుండీలలో లభించాయి.

### కొలనుభారతిలో రేపు 'వసంత పంచమి'



కొలనును పరిశీలిస్తున్న ఆర్డీఓ నాగజ్యోతి

కొత్తపల్లి: కొలనుభారతి క్షేత్రంలో ఆదివారం వసంత పంచమి వేడుకలు నిర్వహించనున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆత్మకూరు ఆర్డీఓ నాగజ్యోతి ఆదేశించారు. క్షేత్రంలో వాహనాలు నిలుపు స్థలం, క్యూలైన్ల ఏర్పాట్లు, ఛారుఘోషిణి నది కొలను వద్ద ఏర్పాట్లను శుక్రవారం ఆర్డీఓ పరిశీలించారు. మహిళల కోసం వ్యక్తిగత మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకొనేందుకు గదులు ఏర్పాటు చేయాలని సూచించారు. క్షేత్రానికి ఉన్న రహదారిలో గుంతలు, పిచ్చిమొక్కలు, ముళ్లకంపలను తొలగించాలన్నారు. తహసీల్దార్ ఉమారాణి, డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న, గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ వెంకటనాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మహమ్మద్ జుబేర్ పాల్గొన్నారు.

### హెచ్‌ఎం, ఐదుగురు టీచర్లకు షోకాజ్ నోటీసులు

వెలుగోడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంతో పాటు ఐదుగురు ఉపాధ్యాయులకు డీఈఓ జనార్దన్ రెడ్డి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఉదయం 8 గంటలకే డీఈఓ తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులకు స్టడీ అవర్స్ నిర్వహించాల్సి ఉన్నా ఉపాధ్యాయులు హాజరు కాలేదు. హెచ్‌ఎంతో పాటు సబ్జెక్టులకు సంబంధించిన ఐదుగురు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అనంతరం పట్టణానికి సమీపాన ఉన్న కస్తూర్బా బాలికల పాఠశాల, మోడల్ స్కూల్‌ను పరిశీలించారు.

### కమనీయం.. పార్వేట మహోత్సవం



అహోబిలేశుడి ఉత్సవ పల్లకీ

ఆళ్లగడ్డ: శ్రీ అహోబిలేశుడి పార్వేట మహోత్సవం కమనీయంగా సాగుతోంది. బాచ్చాపురం నుంచి గురువారం అర్ధరాత్రి శ్రీ ప్రహ్లాదవరద స్వామి, శ్రీ జ్వాలా నరసింహ స్వాములు కొలువైన ఉత్సవ పల్లకీ నాగిరెడ్డిపల్లె చేరుకుంది. శుక్రవారం గ్రామ ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చి ఉత్సవ పల్లకీకి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకీని గ్రామస్తులు భుజాలపై మోసుకుంటూ తెలుపులపై కొలువుంచి భక్తిని చాటుకున్నారు.

### విత్తనశుద్ధి కేంద్రాలపై విజి'లెన్స్'

నంద్యాల(అర్బన్): పట్టణ శివారులో ఏర్పాటైన విత్తన ప్రాసెసింగ్ ప్లాంట్లలో విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. విజిలెన్స్ సీఐ పవన్‌కిశోర్, విజిలెన్స్ వ్యవసాయాధికారి విశ్వనాథ్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం భవ్యసీడ్స్, శ్రీశ్రీభారతి, ఆర్కే ఆగ్రో ఇండస్ట్రీలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. హెచ్‌టీ కాటన్ నెగిటివ్‌గా నిర్ధారించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో విజిలెన్స్ సీఐ పవన్‌కిశోర్ మాట్లాడుతూ.. విత్తశుద్ధి కేంద్రాల యజమానులు చట్టాన్ని గౌరవించాలన్నారు. విత్తన చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏడీఏ రాజశేఖర్, ఏఓ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం ప్రజలపై ఏదో ఓ విధంగా భారం వేయడమే లక్ష్యంగా చేసుకుంది. ఇప్పటికే నిత్యావసర ధరలు, కరెంట్ చార్జీలు పెరిగి సతమతమవుతున్న జనంపై తాజాగా భూముల మార్కెట్ విలువ, రిజిస్ట్రేషన్ చార్జీలను భారీగా పెంచి బాదనుంది. ఎన్నికల ముందు ప్రజలకు చెప్పిన దానికి విరుద్ధంగా సీఎం చంద్రబాబు నాయుడు భూముల రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది.

– నంద్యాల(అర్బన్)



నంద్యాల సమీపంలోని ఓ ప్రైవేట్ వెంచర్

# ఇక భూ బాదుడు!

- భూ విలువ ..రిజిస్ట్రేషన్ చార్జీలను భారీగా పెంచుతున్న కూటమి సర్కారు
- 25 – 60 శాతం వరకు పెంపు
- ప్రజలపై పడనున్న తీవ్ర భారం
- శనివారం నుంచే అమల్లోకి రానున్న వైనం
- ఇప్పటికే పడిపోయిన రియల్ ఎస్టేట్ వ్యాపారం
- పెరిగిన ధరతో మరింత దెబ్బ



నంద్యాల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం



శుక్రవారం రాత్రి కొనసాగుతున్న రిజిస్ట్రేషన్లు

కొత్త నిబంధనల ప్రకారం ఆర్‌సీసీ నిర్మాణాల ధరలు భారీగా పెరగమన్నాయి. జిల్లాలోని మున్సిపాలిటీల పరిధిలోని అపార్టుమెంట్లలో మొదటి రెండు అంతస్తుల్లోని ప్లాట్లకు ఒక్కో చదరపు అడుగు రూ.90 పెరగనుంది. ఇప్పటి వరకు చదరపు అడుగు రిజిస్ట్రేషన్ విలువ రూ.1,400 ఉండగా దీన్ని రూ.1,490కి పెంచుతున్నారు. కొన్ని పట్టణాభివృద్ధి సంస్థల పరిధిలోని, నగర పంచాయతీల్లో చదరపు అడుగుకు రూ. 70 పెంచనున్నారు. మూడో అంతస్తు నుంచి మాత్రం గతంలో వసూలు చేసే రేట్లనే కొనసాగించనున్నారు. వాణిజ్య భవనాలకు మాత్రం చదరపు అడుగుకు గతంతో పోల్చితే రిజిస్ట్రేషన్ విలువ రూ.100 పెరగనుంది. ఈ లెక్కన జిల్లాలో నంద్యాల, ఆళ్లగడ్డ, నందికొట్కూరు, ఆత్మకూరు, డోన్, మున్సిపాలిటీలతో పాటు బేతంచెర్ల తదితర ప్రాంతాల్లో జాతీయ రహదారులు, ప్రధాన రహదారులకు రెండు వైపులా ఒకేలా ధరలు పెంచడానికి దస్త్రాలు సిద్ధమయ్యాయి.

**నేటి నుంచే అమలు**

ఆదాయం పెంచుకోవడమే పరమావధిగా చేసుకున్న రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం భూ విలువల పెంచింది. ఈ మేరకు జిల్లా అధికారులు పెంపు నివేదికలు సిద్ధం చేసి ముసాయిదాను జిల్లా రిజిస్ట్రార్, 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు అందజేశారు. ముందుగా ప్రజల నుంచి అరొకరగా అభ్యంతరాలు స్వీకరించి తుది జాబితాను రూపొందించడంతో జిల్లా మార్కెట్ విలువల కమిటీ ఆమోదం తెలిపింది. ఫిబ్రవరి 1 నుంచి పెరిగిన భూముల విలువలు అమల్లోకి వస్తున్నాయి. ఇప్పటికే భూముల విలువ తక్కువగా ఉందనుకునే ప్రాంతాల్లో 5 నుంచి 15 శాతం, మిగిలిన ప్రాంతాల్లో 20 నుంచి 60 శాతం వరకు పెంచేందుకు రిజిస్ట్రేషన్ శాఖ పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసింది. నిర్మాణాల విలువను రెసిడెన్షియల్, కమర్షియల్ కేటగిరీలుగా విభజించి ధరలు పెంచినట్లు తెలుస్తోంది. దీంతో రిజిస్ట్రేషన్ చార్జీల భారం భారీగా పడనుంది.

**అభ్యంతరాలకు అవకాశం ఏదీ?**

నిబంధనల ప్రకారం జిల్లాలోని నంద్యాల, శిరివెళ్ల, ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల, బనగానపల్లె, డోన్, అవుకు, బేతంచెర్ల, పాణ్యం, ప్యాపిలి, నందికొట్కూరు, బండి ఆత్మకూరు, ఆత్మకూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో భూముల విలువ పెంపునకు సంబంధించిన వివరాలను కార్యాలయాల నోటీసు బోర్డుల్లో అతికించాలి. అయితే, నామ్‌కే వాస్తే కొన్ని కార్యాలయాల్లో మాత్రమే వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచారు. చాలా చోట్ల ప్రజలు తమ అభ్యంతరాలు చెప్పుకునే అవకాశం కూడా ఇవ్వకుండా ఏకపక్షంగా భూములు, స్థలాలు, కట్టడాల మార్కెట్ విలువలను పెంచినట్లు తెలుస్తోంది.

**ఆందోళనలో రియల్టర్లు**

ఇప్పటికే కుదేలైన రియల్ రంగానికి తాజా భూముల విలువ పెంపు గొడ్డలిపెట్టుగా మారింది. ముక్కుతూ మూలుగుతూ ఉన్న ఈ రంగంలో వ్యాపారాలు పూర్తిగా పడిపోయాయి. కొంతకాలంగా భూముల రిజిస్ట్రేషన్లు గణనీయంగా తగ్గాయి. జిల్లాలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ నిర్ణయించిన ఆదాయ లక్ష్యాన్ని కూడా సాధించలేదు. తాజాగా ధరల పెంపుతో రియల్ వ్యాపారం మరింత పడిపోతుందని రియల్టర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**పెంపు ఇలా..**

రెసిడెన్షియల్‌కు సంబంధించి నంద్యాల మండలం నూనెపల్లెలో గజం భూమి విలువ సుమారు రూ.4,800 ఉండగా దాని విలువలో 35శాతం పెరిగితే రూ.6,480 అవుతుంది. అదే విధంగా ఆత్మకూరు పట్టణం వీరభద్ర థియేటర్ ఏరియాలో గజం భూమి విలువ రూ.2 వేలు ఉండగా 35శాతం పెరిగితే రూ.2,700 అవుతుంది. బనగానపల్లె మండలం యనకండ్ల గ్రామంలో గజం భూమి విలువ రూ.1,100 కాగా 35శాతం పెంచితే రూ.1,485గా ఉంటుంది.

- కమర్షియల్‌కు సంబంధించి నంద్యాల పట్టణం కల్పనా సెంటర్, షరాఫ్ బజార్, ఎన్‌కే రోడ్డు, బైర్మల్‌వీధి, శ్రీనివాసనగర్, రాజ్ థియేటర్, సంజీవనగర్ ఏరియాలో రెండు సెంట్ల స్థలంలో ఇల్లు ఉంటే ప్రస్తుత విలువ ప్రకారం ఆర్‌సీసీ మిద్దె విలువ రూ.36.40 లక్షలు కాగా దీన్ని రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి 7.5 చలానా రూపంలో రూ.2.73 లక్షలు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంది. పెరిగిన విలువ ప్రకారం రెండు సెంట్లలో ఆర్‌సీసీ మిద్దె విలువ 46.66 లక్షలు, దీన్ని రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి 7.5 చలానా రూపంలో 3.43 లక్షలు ప్రభుత్వానికి కట్టాల్సి ఉంది. అంటే అదనంగా రూ.70 వేలు భారం ఇంటి యజమానిపై పడనుంది. ఇది కాకుండా మున్సిపాలిటీలో ఉన్న పన్ను పేరు మార్పు కోసం అదనంగా ఒక శాతం మ్యూటేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

**మోయలేని భారం**



భూముల మార్కెట్ విలువల పెంపు పేద, మధ్య తరగతి ప్రజలపై మోయలేని భారమవుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో కూడా భూముల ధరలను విపరీతంగా పెంచారు. పెరిగిన ధరలతో ఎవరూ స్థలాలు కొనుగోలు చేయలేని పరిస్థితి ఉంది. రియల్ వ్యాపారం ఇప్పటికే కుదేలైంది. ఈ తరుణంలో ప్రభుత్వం ఆదాయం పెంచుకోవడానికి ఇలాంటి నిర్ణయం తీసుకోవడం సరికాదు. దీనిపై ప్రభుత్వం పునరాలోచించాలి.

–దూదేకుల కాశీం, కానాల, నంద్యాల(మం)

**ప్రజల నడ్డి విరుస్తున్నారు**



పేదలకు న్యాయం చేస్తామని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆరు నెలల్లోనే ప్రజల నడ్డి విరిచే నిర్ణయాలు తీసుకుంటోంది. ఇటీవల విద్యుత్ ఛార్జీలు పెంచారు. ఇప్పుడు భూములు, కట్టడాలతో పాటు పూరి గుడిసెల మార్కెట్ విలువలు, రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచుతున్నారు. దీని వల్ల ప్రజలపై మోయలేని భారం పడుతుంది. కరోనా చేసిన నష్టం నుంచే సామాన్య ప్రజలు ఇంకా కోలుకోలేదు.

–శంకర్, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ కార్యదర్శి, నంద్యాల

# స్థిర అభివృద్ధికి 'సహకార'ం

- జిల్లా కలెక్టర్ రాజకుమారి



పంట రుణాల చెక్కులను అందజేస్తున్న కలెక్టర్

నంద్యాల: స్థిరమైన అభివృద్ధిని పెంపొందించడంలో సహకార సంఘాలు కీలకపాత్ర పోషిస్తాయని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో అంతర్జాతీయ సహకార సంవత్సరంలో చేపట్టాల్సిన అంశాలపై సంబంధిత అధికారులు, కమిటీ సభ్యులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. 2025ను అంతర్జాతీయ సహకార సంవత్సరంగా (ఐవైసీ) ప్రకటించి సహకార సంస్థ బిల్డ్ ఏ బెటర్ వరల్డ్ అనే నినాదంతో నెలవారి లక్ష్యాలను ఐక్యరాజ్యసమితి నిర్దేశించిందన్నారు. జాతీయ లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా ఐవైసీ స్టేట్ అపెక్స్ కమిటీ ఏర్పాటు చేశారన్నారు. సహకార క్యాలెండర్ ప్రకారం నెలకు ఒక నినాదంతో ముఖ్య అంశాలు, లక్ష్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. పశుసంవర్ధకం, వ్యవసాయం, పంచాయతీరాజ్, మత్స్యశాఖ, గ్రామీణ అభివృద్ధి.. తదితర శాఖలు సహకార సంఘాల అభివృద్ధికి దోహదపడేలా కృషి చేయాలన్నారు. అనంతరం కోపరేటివ్ సొసైటీ బ్యాంకు ద్వారా ఐదుగురు రైతులకు ఒక్కొక్కరికి రూ.3 లక్షలు చొప్పున పంట రుణాలు చెక్కులను అందజేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, జిల్లా సహకార అధికారి వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

**ఎంఎస్‌ఎంఈ భవనంలో టెక్నికల్ విద్య**

బేతంచెర్ల: జిల్లాలో డిప్లొమా, ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులకు ఎంఎస్‌ఎంఈ భవనంలో టెక్నికల్ విద్యను అందుబాటులోకి తీసుకువస్తామని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. బేతంచెర్ల మండలంలో అసంపూర్తిగా ఉన్న భవనాలను శుక్రవారం ఆమె పరిశీలించారు. వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రూ. 36 కోట్లతో నిర్మిస్తున్న బీసీ రెసిడెన్షియల్ స్కూలు, పాఠశాల, రూ.5.50 కోట్లతో నిర్మిస్తున్న ఎంఎస్‌ఎంఈ భవన యూనిట్, రూ.7.50 కోట్లతో నిర్మిస్తున్న ఐటీఐ కళాశాల పనులు చివరి దశకు చేరుకున్నాయన్నారు. హెచ్ కొట్టాల గ్రామ సమీపాన రూ.2.20 కోట్లతో నిర్మిస్తున్న బీసీ వాల్మీకి కమ్యూనిటీ భవనం, పట్టణంలో రూ.80 లక్షలతో నిర్మిస్తున్న ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ పునరుద్ధరణ పనులు పూర్తికావొచ్చాయన్నారు. ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు పదో తరగతి విద్యార్థులను దత్తత తీసుకొని 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాలిటెక్నిక్ కళాశాల నిర్మాణ పనుల జాప్యానికి గల కారణాలను తెలుసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ శ్రీధర్ రెడ్డి, జిల్లా పరిశ్రమల మేనేజర్ జవహర్ బాబు, డీఈ ప్రసాద్ రెడ్డి, ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, ఏఈ మధు, గోరుమాను కొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# 5న వైఎస్సార్‌సీపీ ఫీజు పోరు

- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి



ఫీజు పోరు పోస్టర్లు విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, చిత్రంలో పార్టీ నాయకులు

కల్లూరు: విద్యార్థులకు అండగా నిలుస్తూ ఈనెల 5న వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఫీజు పోరు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. తన స్వగృహంలో ఫీజు పోరుకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాటసాని..మాట్లాడుతూ ఫీజు పోరులో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులతో కలసి నంద్యాలలోని ఉదయానంద హోటల్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రమందిస్తామన్నారు. విద్యార్థులు, నంద్యాల జిల్లాలోని అన్ని నియోజకవర్గాల పార్టీ నేతలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన కింద రూ. 3,900 కోట్లు వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు అవుతున్నా ఇంతవరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడం దారుణమన్నారు. కోర్సులు పూర్తయిన విద్యార్థులకు కళాశాల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోడంతో విద్యార్థులు చదువులు కొనసాగించలేక, పనులకు వెళ్తున్నారన్నారు.

**మాట తప్పడం చంద్రబాబు నైజం**

సుదీర్ఘ అనుభం ఉన్న రాజకీయ నాయకుడిని అని, సంపద సృష్టిస్తానని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టారని కాటసాని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల కన్నా ఎక్కువ పథకాలు అందిస్తామని ఎన్నికల ముందు చెప్పి అధికారంలోకి వచ్చాక మాట తప్పారన్నారు. 'సూపర్ సిక్స్' పేరుతో హామీలు ఇచ్చి వాటిని అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. 'కూటమి' నాయకులందరూ అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న పథకాలతో రాష్ట్రం మరో శ్రీలంక అవుతుందని చెప్పలేదా అని కాటసాని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ పథకాలు అందిస్తామని ప్రజలతో ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదని చెప్పడం సిగ్గుగా ఉందన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయకుంటే చొక్కాలు పట్టుకోమని చెప్పిన నేతలు ఇప్పుడు ఎక్కడున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేణుక, కార్పొరేటర్లు శ్వేతారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, నారాయణరెడ్డి, లక్ష్మిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మహేశ్వర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, హనుమంతురెడ్డి, ఈశ్వరయ్య, రామకృష్ణారెడ్డి, శివశంకర్‌రెడ్డి, శివారెడ్డి, శ్రీనివాసులు యాదవ్, మద్దిలేటి, తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఆ ఇద్దరే ... ఈ ఇద్దరా..!

- హైవేలను అడ్డాగా చేసుకుంటున్న దొంగలు
- దాడి చేసి నిలువు దోపిడీ చేస్తున్న ముఠా
- పది రోజుల్లో రెండు ఘటనలు
- దోపిడీకి పాల్పడేది ఒకే ముఠాగా అనుమానం



దంపతులపై దాడి జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్)

సాక్షి, నంద్యాల: జాతీయ రహదారుల వెంట దోపిడీ దొంగలు మాటు వేసి వాహనదారులను నిలుపు దోపిడీ చేస్తున్నారు. ఒంటరిగా వెళ్తున్న వారిని టార్గెట్‌గా చేసుకుని రెచ్చిపోతున్నారు. సొమ్ము దోచుకోవడంతో పాటు కత్తులు, రాళ్లతో విచక్షణ రహితంగా దాడి చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. రాత్రి వేళల్లో రోడ్డు మీదకే వెళ్లాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. ఎవరు ఎక్కడి నుంచి దాడి చేస్తారో తెలియక వాహనదారులు భయం భయంగా ప్రయాణాలు సాగిస్తున్నారు. జనవరి 19వ తేదీన రాత్రి కర్నూలు – నంద్యాల జాతీయ రహదారిలో శాంతిరామ్ ఆస్పత్రి సమీపంలో దోపిడి దొంగలు హల్‌చల్ చేశారు. పాణ్యం మండలం భూపనపాడు గ్రామానికి చెందిన దామరేకుల పెద్దన్న, జయమ్మ దంపతులు వారి కుమార్తెను ప్రసవం కోసం శాంతిరామ్ హాస్పిటల్ చేర్పించారు. జయమ్మ బహిర్భూమికి వెళ్లేందుకు భర్తను తోడు తీసుకుని హాస్పిటల్ సమీపంలో ఉన్న పొలం వద్దకు వెళ్తుండగా అప్పటికే అక్కడ మాటు వేసి ఉన్న దొంగలు వారిపై దాడి చేసి బంగారు చైన్‌ను లాక్కొని పరారయ్యారు. పెద్దన్నపై కత్తులతో దాడి చేశారు. ఈ ఘటన మరిచిపోక ముందే జిల్లా కేంద్రంలోనూ అలాంటి ఘటనే పునరావృతమైంది. పది రోజుల్లోనే 28వ తేదీ రాత్రి 8 గంటల సమయంలో నంద్యాల పట్టణానికి చెందిన ఓ ప్రేమ జంటపై ఇద్దరు దుండగులు దాడి చేసి బంగారు చైన్, కొంత నగదు దోచుకున్నారు. కాగా ఈ రెండు ఘటనల్లో దాడులకు పాల్పడింది ఒకే ముఠా సభ్యులా అనే అనుమానం వ్యక్తమవుతోంది. బాధితుల వివరాల మేరకు దుండగులు హిందీ భాషలో మాట్లాడుతుండటం, విచక్షణా రహితంగా దాడులు చేయడం చూస్తే రెండు చోట్ల దుశ్చర్యకు పాల్పడింది వారేనని స్థానికులు చర్చించుకుంటున్నారు.

**పాణ్యం ఘటనతో మేల్కొని పోలీసులు**

శాంతిరాం ఆసుపత్రి సమీపంలో దంపతులపై దాడి జరిగి రెండు వారాలవుతున్నా పోలీసులు ఈ కేసు దర్యాప్తులో పురోగతి సాధించలేదు. దీంతో నంద్యాల పట్టణ శివారులో రెండో ఘటన చోటు చేసుకుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లా కేంద్రం నుంచి శాంతిరామ్ హాస్పిటల్ కేవలం 15 కి.మీ దూరంలోనే ఉంది. ఇంజినీరింగ్, ఫార్మసీ, మెడికల్ కాలేజీలు ఉండడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. దీనికి తోడు కడప నుంచి హైదరాబాద్ మార్గంలో వాహనాలు వెళుతూనే ఉంటాయి. ఇంత రద్దీగా ఉండే జాతీయ రహదారి పక్కనే దుండగులు దోపిడీకి పాల్పడుతుండటంతో పోలీసుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**ముమ్మర దర్యాప్తు చేస్తున్నాం**

పది క్రితం దంపతులపై దాడి చేసిన నిందితులే నంద్యాల శివారులో యువకుడిపై దాడి చేశారా అన్న విషయం విచారణలో తెలుస్తుంది. పాణ్యం కేసులో దర్యాప్తు వేగంగా సాగుతోంది. కొందరు అనుమానితులను గుర్తించాం. వారిని అదుపులోకి తీసుకుని విచారించిన తర్వాత అన్ని విషయాలు వెలుగులోకి వస్తాయి. రెండు, మూడు రోజుల్లో కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడిస్తాం.

– జావళి అల్ఫోన్స్, డీఎస్పీ, నంద్యాల

# కుంభాభిషేకానికి నేడు అంకురార్పణ



కలశాలను ఊరేగిస్తున్న దృశ్యం



రాజ గోపురం పైకి చేరుకునేందుకు కర్రలతో మెట్లు ఏర్పాటు చేసిన దృశ్యం

మంత్రాలయం: ప్రసిద్ధ ఉరుకుంద ఈరన్న స్వామి క్షేత్రంలో తొలి కుంభాభిషేక మహోత్సవానికి శనివారం అంకురార్పణ జరగనుంది. ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు నేతృత్వంలో మూడు రోజుల పాటు వేడుకలు నిర్వహించనున్నారు. రాజగోపురాలపై కలశాల ప్రతిష్ట, గణపతి, లక్ష్మీదేవి, నవగ్రహాల ప్రతిష్టాపన చేయనున్నారు. తూర్పు ప్రధాన రాజగోపురం ముంగిట గణపతి, లక్ష్మీదేవి మంటపాలు సిద్ధం చేశారు. అలాగే ఆలయ ఈశాన్య భాగంలో నవగ్రహాల మంటపం నెలకొల్పారు. ఉత్సవాల నేపథ్యంలో రాజగోపురాలు, మహాప్రాకారం, వీధులను విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆలయం అభిముఖంగా పచ్చని తోరణాలతో యాగమంటపాన్ని ఏర్పాటు చేశారు. వీఐపీలు కొలువు దీరేందుకు ఆ పక్కనే ప్రత్యేక వేదిక రూపొందించారు. కలశ ప్రతిష్టను భక్తులు వీక్షించేందుకు ఆలయ చుట్టూ రూ.50 లక్షలతో పందిళ్లు నెలకొల్పారు. భక్తుల సౌకర్యార్థం దాత సాయంతో ప్రత్యేక షెడ్లు వేయించారు. ఇప్పటికే భక్తులకు సరిపడిన లడ్డూ ప్రసాదాలను సిద్ధం చేశారు. రాజగోపురాలపై క్రతువులు గావించేందుకు ప్రతి గోపురం పైకి చేరుకునేందుకు ప్రత్యేక మెట్ల సముదాయాన్ని నెలకొల్పారు. కలశాలను శుక్రవారం ఆదోని పట్టణంలో ప్రత్యేక వాహనంపై ఉంచి ఊరేగించారు.